# సాక్షి ఖమ్మం

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024




## సింగరేణి 'సౌర'భాలు

సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో దూసుకెళ్తున్న సింగరేణి సంస్థ కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించనున్నారు. 8లో



## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనను వేడుకగా నిర్వహించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 21°

## వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం చలి ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత ఎండ మొదలై గంట గంటకు పెరిగే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### నేడు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30గంటలకు వైరా మండలం స్నానాల లక్ష్మీపురం చేరుకోనున్న ఆయన తన సోదరుడి దశదినకర్మ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆతర్వాత కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చేరుకుని సింగరేణి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన 10.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను సాయంత్రం 4గంటలకు ప్రారంభిస్తారు. అనంతరం టేకులపల్లి మండలం కోయగూడెంలో జరిగే సమావేశంలో పాల్గొన్నాక ఖమ్మం చేరుకుని బస చేస్తారు. సోమవారం ఉదయం భట్టి హైదరాబాద్ బయలుదేరనున్నారు.

**వ్యవసాయ మంత్రి తుమ్మల..**

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో పర్యటిస్తారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోదరుడి దశదినకర్మలో పాల్గొన్నాక సాయంత్రం కొత్తగూడెంలో సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి హాజరవుతారు. అక్కడి నుంచి తుమ్మల హైదరాబాద్ వెళ్లనున్నారు.

### రైల్వే పురోభివృద్ధికి కృషి : ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వేపరంగా అభివృద్ధికి అహర్నిశలు చేసిన కృషితో రైల్వేస్టేషన్లలో అన్ని వసతులు సమకూరాయని బీఆర్ఎస్ లోక్ సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే సంబంధిత సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించడమే కాక ప్రధానమంత్రి, రైల్వే మంత్రులను, ఇతర కేంద్ర మంత్రులకు లేఖలు ఇవ్వడం ద్వారా రైల్వేస్టేషన్ల అభివృద్ధి, కొత్త మార్గాలు, ఆర్వోబీ, ఆర్‌యూబీ, అండర్ పాస్‌ల నిర్మాణానికి నిధులు వచ్చాయని తెలిపారు. ఈనెల 26న ప్రధాని మోదీ ప్రారంభించే ముత్యాలగూడెం, మీనవోలు అండర్ పాస్, కొత్తగూడెం ఆర్‌ఓబీ, బ్రిడ్జి, డోర్నకల్ పాపటపల్లి అండర్ పాస్, మధిర–మోటమర్రి, ఎర్రుపాలెం–తొండల గోపవరం రోడ్ అండర్ పాస్‌ల కోసం గతంలో లోక్‌సభలో పలుమార్లు ప్రస్తావించానని ఎంపీ గుర్తు చేశారు. కాగా, అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం, మధిర, ఎర్రుపాలెం, కొత్తగూడెం, మణుగూరు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ఇక భద్రాచలం–కొవ్వూరు రైల్వేలైన్ కోసం పార్లమెంట్‌లో మాట్లాడడమే కాక 125 లేఖలు రాశానని ఎంపీ వెల్లడించారు.

### మంత్రులను కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రి తుమ్మలను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా మంత్రులను సన్మానించాక.. బ్యాంకు ద్వారా రుణాల పంపిణీ, మూలధనం తదితర అంశాలపై చర్చించారు.

సండే స్పెషల్

**వందల ఏళ్ల క్రితమే** వాననీటిని ఒడిసిపట్టేలా ఖమ్మం ఖిల్లాలో బావిని నిర్మించారు. ఈ బావిని జాఫర్ బావిగా పిలుస్తుండగా.. కాలక్రమంలో రాజ్యాలు పోయి రాజులూ పోయారు. దీంతో బావి నిర్వహణపై పట్టింపు కరువై శిథిలమవడం మొదలైంది. ఆ తర్వాత బావి చుట్టూ నివాసాలు ఏర్పడడం.. కాలనీలు పెరగడంతో స్థానికులు చెత్తాచెదారం కూడా అందులోనే వేయడం ప్రారంభించారు. ఫలితంగా కొన్నాళ్లకు బావి నామరూపాలు లేకుండా పోగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) అధికారులు గుర్తించారు. ఈ బావిని సుందరీకరిస్తే మరో పర్యాటక కేంద్రంగా విరాజిల్లడమే కాక.. పురాతన కట్టడాన్ని పరిరక్షించినట్లవుతుందనే భావనతో చేపట్టిన పనులు ఇటీవల పూర్తవవడంతో జాఫర్ బావి కొత్త అందం సంతరించుకుంది.. నగర వాసులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది.

– సాక్షి, ఖమ్మం డెస్క్

# అలనాటి బావికి.. సుందరరూపం!



పగటి పూట కొత్త అందంతో...

**ఖమ్మం ఖిల్లాపై జాఫర్ బావికి కొత్త అందం**

- వందల ఏళ్ల నాటి కట్టడం సుందరీకరణ
- రూ.60లక్షల నిధులు వెచ్చించిన కేఎంసీ
- కార్పొరేషన్‌కు సహకరించిన 'రెయిన్ వాటర్ ప్రాజెక్టు' బాధ్యులు
- ఖమ్మంలో మరో పర్యాటక కేంద్రం సిద్ధం

### ఇదీ చరిత్ర...

ఖమ్మం ఖిల్లా దాదాపు నాలుగు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉంటుంది. రెండు కోట గోడలతో ఈ నిర్మాణం వందల ఏళ్ల క్రితం నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. అనంతరం జాఫరుద్దౌలా తాలూకాదార్‌గా ఉన్న సమయంలో కోటపై మహల్ నిర్మించారు. ఇక కాకతీయుల కాలంలో ఖిల్లాపై వాననీటిని ఒడిసి పట్టేలా ఒక బావి నిర్మించారు. ఓ పక్క కొండ రాయిని ఆసరాగా చేసుకుని వర్షపు నీరంతా చేరేలా దక్షిణాన లోతట్టు ప్రాంతం ఎంచుకుని ఈ బావి నిర్మాణం జరిగింది. 60అడుగుల పొడవు, 70 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పుతో ఈ బావిని నిర్మించగా... ఆతర్వాత పాలించిన కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీలు బావి చుట్టూ గోడల ఎత్తు పెంచి మరింత పటిష్టం చేశారు. స్థానికంగా ఈ బావికి జాఫర్‌గా బావిగా పేరు స్థిరపడింది.

### మరి.. ఆ తర్వాత?

కాలక్రమంలో రాజులు, రాజ్యాలు పోయాక జాఫర్ బావి నిరాదరణకు గురైంది. స్థానికులు చెత్తాచెదారం వేస్తుండడంతో పనికి రాని వస్తువులతో బావి నిండిపోయింది. అయినా చాన్నాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా చారిత్రక, వారసత్వ సంపదగా నిలవాల్సిన బావి నామరూపాలు లేకుండా పోయే పరిస్థితి నెలకొంది.

### ఇప్పుడేం చేశారు..

జాఫర్ బావి ఆనవాళ్లు కోల్పోతుందని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) అధికారులు గుర్తించారు. దీంతో వారసత్వ సంపదను భావితరాలకు అందజేయాలని సంకల్పించారు. ఈ మేరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాలతో పురావస్తు శాఖను సంప్రదించారు. బావి పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులకు కేఎంసీ రూ.60లక్షలు వెచ్చించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యాన చారిత్రక బావుల పరిరక్షణతో పాటు వాన నీటి వనరుల సంరక్షణకు కృషి చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన 'రెయిన్ వాటర్ ప్రాజెక్టు' బాధ్యులు కూడా ఇందులో పాలుపంచుకునేందుకు ముందుకొచ్చింది.



అప్పుడు.. : చెత్తాచెదారంతో నిండిన బావి



ఇప్పుడు.. : రాత్రివేళ లైట్ల వెలుతురులో జాఫర్ బావి

### ఆపై సుందరీకరణ

బావి నుంచి మురుగునీరు, చెత్తచెదారం తొలగించాక ఇతర పనులపై కేఎంసీ దృష్టి సారించింది. ఈ సందర్భంగా రెయిన్ వాటర్ ప్రాజెక్టు బాధ్యుల పర్యవేక్షణలో బావి గోడలకు రంగులు వేయించి తీర్చిదిద్దగా పగలు బావి కొత్త అందాలతో కనిపిస్తోంది. ఆతర్వాత లైటింగ్ కూడా అమర్చడంతో రాత్రి వేళ కాంతులు విరజిమ్ముతోంది. సుందరీకరణ పనుల అనంతరం బావిని కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పి.నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి తదితరులు ఇటీవల ప్రారంభించారు. దీంతో జిల్లా కేంద్రంలో ఇంకో పర్యాటక కేంద్రం అందుబాటులోకి రాగా.. ఇప్పుడే ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్లు, ఇతర ఫొటో షూట్లు నిర్వహించేందుకు నగరవాసులే కాక జిల్లాలోని వివిధ ప్రాంతాల వారు ఇక్కడకు బారులుదీరుతున్నారు.

### చకచకా పనులు

అనుకున్నదే తడవుగా జాఫర్ బావి సుందరీకరణకు కేఎంసీ చకచకా అడుగులు వేసింది. నిధులు మంజూరు చేయడమే కాక గత ఏడాది ఏప్రిల్‌లో పనులు మొదలుపెట్టారు. తొలుత బావిలో నిలిచిన మురుగునీటిని తొలగించేందుకు 7 హెచ్‌పీ మోటార్లు రెండింటిని బిగించి 23 రోజులు నిరంతరం నడిపిస్తే బావి ఖాళీ అయింది. ఆతర్వాత 24మందిని సిబ్బంది పూర్తిగా బావి పనులకే కేటాయించారు. సుమారు 90 రోజుల పాటు వారు నిరంతరం శ్రమిస్తూ సుమారు 2.12లక్షల క్యూబిక్ మీటర్ల చెత్తను తొలగించారు. ఇంకేముంది బావి పూర్వరూపం బయటపడింది.



చెత్త తొలగింపు, సుందరీకరణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు (ఫైల్)

## రైతులకు రక్షణ కరువు

- ఐక్య ఉద్యమాలే అన్నదాతలకు రక్ష
- రౌండ్ టేబుల్ సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మంమయూరిసెంటర్: అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్‌లో రైతులకు రక్షణ కరువైందని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. రైతుకు దన్నుగా నిలవని ఏ ప్రభుత్వం మనజాలదనే విషయాన్ని పాలకులు గుర్తించాలని సూచించారు. కిసాన్ సంయుక్త మోర్చా, తెలంగాణ విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యాన 'రైతాంగ సమస్యలు, ఢిల్లీ ఆందోళన – ప్రభుత్వ తీరు' అంశంపై ఖమ్మంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడానికి కొంత మేర ప్రకృతి కారణమైతే, 80 శాతం పాలకవర్గాల తీరే కారణమని తెలిపారు. పారిశ్రామిక, కార్పొరేట్ వర్గాలపై ఉన్న ప్రేమ రైతాంగంపై పాలకులకు లేకపోవడం గర్హనీయమన్నారు. ఇప్పటికైనా ఐక్య ఉద్యమాలే రైతులకు రక్షగా నిలుస్తాయని ఆయన తెలిపారు. కాగా, రైతులకు సంఘీభావంగా మార్చి 14న జరిగే ఆందోళనలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి వంజాకు లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, పోటు ప్రసాద్, రాయల చంద్రశేఖర్‌రావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, దండి సురేష్, రాంబాబు, మలీదు నాగేశ్వరరావు, అడపా రామకోటయ్య, ఇంద్రసేన, రవీందర్, లింగాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

**నేలకొండపల్లి:** నకిలీ వస్తువులు తయారు చేసే వారిని అరెస్ట్ చేసి జైలులో పెట్టాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. నేలకొండపల్లిలోని ప్రకృతి ఆశ్రమంలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, పరిస్థితులు ఎప్పుడే ఒకేలా ఉండవనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. పంటను ఉత్పత్తి చేసే రైతులే ధర నిర్ణయించగలిగితే పరిస్థితిలో మార్పు వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కర్నాటి భానుప్రసాద్, బి.రవీంద్రనాథ్, పాల్తీయ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓటర్లు 76,869**

ఖమ్మం సహకారనగర్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికకు సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారులు శనివారం విడుదల చేశారు. ఈమేరకు ఉమ్మడి ఖమ్మంలో 76,869మంది ఓటర్లు ఉన్నారని తేలింది. ఇందులో పురుషులు 46,556, స్త్రీలు 30,309, ఇతరులు నలుగురు ఉండగా, 115 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ జాబితాను తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించగా, వచ్చే నెల 14వ తేదీ వరకు అభ్యంతరాలు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. కాగా, ఇంకా అర్హులు ఉంటే మార్చి 14వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగానే కాక ceotelangana.gov.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 29వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి ఏప్రిల్ 4వ తేదీన పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు. కాగా, ఎమ్మెల్సీ ముసాయిదా జాబితా విడుదల సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈసమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీఓ గణేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని 132/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. అలాగే, 33 కేవీ ఫీడర్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతు పనులు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న వేసవి, ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షల దృష్ట్యా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఖమ్మం నగరంలోని 15 సబ్‌స్టేషన్లతో పాటు రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం, రఘునాథపాలెం, కామేపల్లి మండలంలోని ముచ్చర్ల, చింతకాని మండలంలోని పందిళ్లపల్లి, నాగులవంచ, ఖమ్మం రూరల్ సబ్ స్టేషన్లతో పాటు ఇంకొన్ని సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందనే విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఎస్ఈ కోరారు.

## వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

- జీళ్లచెరువుకు పోటెత్తిన భక్తులు



స్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న పండితులు



పట్టువస్త్రాలు అందజేస్తున్న ప్రసాదరెడ్డి దంపతులు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం కనులపండువగా సాగగా 108 మంది దంపతులు క్రతువు జరిపించారు. యాజ్ఞికులు వెలగలేటి రామానుజాచార్యులు, సహాయకులు చిలకమర్రి స్వామినాథ్ బృందం ఆధ్వర్యాన జరిగిన కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించగా, నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరుకు చెందిన చెరువు సందీప్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు. కల్యాణం అనంతరం గ్రామవీధుల్లో శ్రీవారి గ్రామసేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ బూర్లె వీరబాబు, ఈఓ నారాయణాచార్యులు, పాలకమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


### జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించడంతో పాటు పల్లకీసేవ నిర్వహించగా పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రామయ్యకు సహస్ర కలశాభిషేకం

**కనుల పండువగా రంగనాథ స్వామికల్యాణం**





కలశాల వద్ద పూజలు చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో మాఘమాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్వామివారికి సహస్ర కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆవాహనం చేసిన కలశాలతో మంగళవాయిద్యాలు, మేళతాళాలు నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత బేడా మండపంలో కొలువుదీరిన శ్రీసీతాలక్ష్మణ సమేత రామయ్య స్వామికి ఆవాహనం చేసిన జలాలతో అభిషేకం జరిపారు. హారతులు సమర్పించారు. సహస్ర కలశాభిషేక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. తెలిసీ తెలియక జరిగిన తప్పొప్పుల ప్రాయశ్చిత్తార్థం మాఘపౌర్ణమి రోజున స్వామి వారికి సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందని వేదపండితులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పవళింపు సేవ, నిత్యకల్యాణం రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా రంగనాథ కల్యాణం**

రామాలయానికి అనుబంధంగా రంగనాయకుల గుట్టపై వేంచేసియున్న శ్రీ రంగనాథ స్వామి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా జరిపారు. దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను, కల్యాణ సామగ్రిని రామాలయం నుంచి మేళతాళాల నడుమ రంగనాయకుల గుట్ట ఆలయానికి తీసుకొచ్చారు. అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

**నేటి నుంచి నిత్యకల్యాణాలు..**

సహస్ర కలశాభిషేకోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులపాటు రద్దు చేసిన నిత్యకల్యాణాలు ఆదివారం నుంచి తిరిగి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు ఒక ప్రకటన చేశారు. ఆదివారం స్వామివారి నిత్యకల్యాణం తోపాటు తెల్లవారుజామున అభిషేకం జరపనున్నారు. భక్తులు గమనించి స్వామివారి నిత్యకల్యాణంలో యథావిధిగా పాల్గొనాలని కోరారు.

## క్లుప్తంగా

### ఆధునిక పంటలపై దృష్టి సారించాలి

కూసుమంచి: రైతులు ఆధునిక పంటల సాగుపై దృష్టి సారించి లాభాలు గడించాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర సూచించారు. మండలంలోని కేశ్వాపురానికి చెందిన మందపల్లి నాగరాజు స్ట్రాబెరీ, గోల్డెన్ బెర్రీ పంటలను సాగుచేయగా శనివారం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్ట్రాబెరీ పంట 45 రోజుల్లో కాపుకు వస్తుందని, పంటకు మంచి డిమాండ్ ఉంటుందని రైతు వివరించారు. ఏఓ వాణి, ఏఈఓలు రవీందర్, సాయిరాం, వంశీకృష్ణ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


నగదు అందజేస్తున్న ఎంపీపీ, ఆయన కుటుంబీకులు

కూసుమంచి: మండలంలోని గోరీలపాడుతండాలో నిర్మిస్తున్న రామాలయానికి ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్ రూ.5లక్షలు విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు నగదును శనివారం నిర్మాణ బాధ్యులకు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీకి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో బాసూనాయక్, బాబునాయక్, నాగులేనాయక్, చందానాయక్, శంకర్, శ్రీను, రాగునాయక్, రాంకోటి, బాబు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుపై హర్షం

ఖమ్మం సహకారనగర్: జీఓ 317 అమలుతో ఉద్యోగులకు ఏర్పడిన సమస్యలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటుచేయడంపై టీఎన్జీవోస్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్.సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. జీఓ 317తో ఉత్పన్నమైన సమస్యలను కమిటీ పరిశీలించి త్వరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

### ప్రభుత్వానికి రిటైర్డ్ ఉద్యోగి ఆర్థిక సాయం !



వివరాలు వెల్లడిస్తున్న గులాం జాఫర్ (ఎడమ)

ఖమ్మం మామిళ్లగూడెం: ఎక్కడైనా ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయడం ఆనవాయితీ. కానీ ఖమ్మంలో మాత్రం ఓ రిటైర్డ్ పోలీసు ఉద్యోగి ప్రజాసంక్షేమ పథకాల అమలుకోసం ప్రభుత్వానికే ఆర్థికసాయం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన శనివారం ఖమ్మంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన గులాం జాఫర్ ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా 1981లో రిటైర్ అయ్యారు. ఈమేరకు ప్రజాసంక్షేమ పథకాల అమలుకోసం వచ్చేనెల పింఛన్ నుంచి రూ.20వేలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్థికంగా ఉన్న మేధావులు, విద్యావంతులు, డాక్టర్లు, వ్యాపారులు, రాజకీయ నాయకులు కూడా ముందుకు రావాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికసాయం ప్రకటించిన గులాం జాఫర్‌ను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జి.రమేష్‌బాబు ఆధ్వర్యాన పలువురు సన్మానించారు.

### రేపు అండర్ బ్రిడ్జి ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలోని కామంచికల్ వద్ద నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జిని సోమవారం ప్రారంభించనున్నారు. ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా బ్రిడ్జిని ప్రారంభిస్తారని సీసీఐ జాఫర్ తెలిపారు. ఇక్కడ ఉన్న 98వ నంబర్ రైల్వే గేట్‌తో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండగా అండర్‌బ్రిడ్జి నిర్మించినట్లు వెల్లడించారు.

### పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

సత్తుపల్లి: పోలీసులు తనను అకారణంగా కొట్టారంటూ కల్లూరు పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఓ వ్యక్తి, ఆయన కుటుంబీకులు నిరసన తెలిపారు. కల్లూరు మండలం కొత్తబోడిమెల్లకు చెందిన ఎర్రబడి శంకర్ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఈనెల 22న పోలీసులు పిలిపించారు. శనివారం కూడా ఎస్‌ఐ షాకీర్ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో తనను కొట్టారంటూ శంకర్, ఆయన కుమార్తెలు కల్యాణి, శివజ్యోతి స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వివిధ పార్టీల నాయకులు రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. ఈ అంశంపై ఎస్‌ఐ మాట్లాడుతూ శంకర్ పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నాడనే సమాచారంతో పిలిపించి కౌన్సెలింగ్ మాత్రమే ఇచ్చామని స్పష్టం చేశారు.

### మార్కెట్ ఉద్యోగులకు పదోన్నతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్లలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతి లభించింది. మద్దులపల్లి సూపర్‌వైజర్ పి.వీరాంజనేయులుకు అసిస్టెంట్ సెక్రటరీగా పదోన్నతి కల్పిస్తూ ఖమ్మంకు, ఖమ్మం సూపర్‌వైజర్ వి.వెంకటేశ్వర్లుకు పదోన్నతి కల్పించి వైరా మార్కెట్‌కు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

# సింగరేణి 'సౌర'భాలు..

- సోలార్ విద్యుదుత్పత్తిలో నెట్‌జీరో దిశగా అడుగులు
- సంస్థవ్యాప్తంగా ఇప్పటికే 224 మెగావాట్లతో 9 ప్లాంట్లు..
- ఏటా 350 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి
- నేడు కొత్తగూడెంలో మరో ప్లాంట్‌ను ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం
- హాజరుకానున్న మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల తదితరులు


ప్రారంభానికి సిద్ధమైన 10.5 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి కేంద్రం

సౌర విద్యుదుత్పత్తిలో సింగరేణి సంస్థ శరవేగంగా అడుగులు వేస్తోంది. తనకు అవసరమైన విద్యుత్‌ను తానే ఉత్పత్తి చేసే (నెట్‌జీరో) దిశగా సాగుతోంది. ఇప్పుడు కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన మరో సోలార్ ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనుంది.

– సింగరేణి(కొత్తగూడెం)

**ఇప్పటికే 350 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి**

సింగరేణి సంస్థ 11 ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్లు, ఇతర అవసరాల కోసం 700 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తోంది. 2018లో సౌర విద్యుదుత్పత్తిలో అడుగిడిన సంస్థ 14 సోలార్ ప్లాంట్లను ప్రారంభించాలని నిర్ణయించింది. స్టేజీ–1లో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నిర్మించాలని తలపెట్టగా, ఇప్పటికే 224 మెగావాట్ల సామర్థ్యంతో 9 ప్లాంట్లను ఏర్పాటు చేసింది. తద్వారా సుమారు 350 మిలియన్ యూనిట్లను విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. రానున్న మూడేళ్లలో స్టేజీ–2 కింద మరో 400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీంతో మరో 450 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఇవి పూర్తయితే సంస్థకు అవసరమైన 700 మిలియన్ యూనిట్లు పోగా మరో 100 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగలనుంది.

**రూ. 200 కోట్ల మిగులు..**

సంస్థ సౌర విద్యుదుత్పత్తి ద్వారా రూ. 200 కోట్ల ఆదాయం మిగుల్చుకుంది. కంపెనీ ఏటా వినియోగిస్తున్న 700 మిలియన్ యూనిట్లను రాష్ట్ర ప్రభుత్వం నుంచి యూనిట్‌కు రూ. 8 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తోంది. 350 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, ఈమేరకు కొనుగోళ్ల తగ్గిపోయాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ విద్యుదుత్పత్తిలో నెట్‌జీరో దిశగా పయనిస్తోంది. ఇటీవల సింగరేణి భూగర్భ గనులు, సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్లను సందర్శించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో స్టేజీ–2 ప్లాంట్లను ప్రారంభించేందుకు సిద్ధమైంది.

**పవన విద్యుదుత్పత్తి యోచన కూడా...**

సంస్థ రానున్న మూడేళ్లలో 1000 మెగావాట్ల పవన్ విద్యుత్(విండ్ ఎనర్జీ) ఉత్పత్తి చేయాలనే ఆలోచన కూడా చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల సింగరేణి ఈఅండ్‌ఎం అధికారులు రాజస్థాన్ వెళ్లి అధ్యయనం చేసి వచ్చారు. రాష్ట్రంలో పవన్ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలంగా ఉన్న మహబూబ్‌నగర్, పరిగి ప్రాంతాలను గుర్తించి ఎంపిక చేసినట్లు తెలిసింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నీటిని అందించే రిజర్వాయర్ నీటిపై ఇప్పటికే 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసింది. తాజాగా మరో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. కోలిండియావ్యాప్తంగా సింగరేణే తొలిసారిగా ఫ్లోటింగ్ ప్లాంట్ నిర్మించింది. బొగ్గు నిక్షేపాలు క్రమంగా అంతరిస్తుండగా సంస్థ, కార్మికుల మనుగడ కోసం నూతన సాంకేతికతతో, కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నట్లు సింగరేణి సోలార్ విభాగం జీఎం జానకిరామయ్య తెలిపారు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, స్థానికులకు ఉపాధి కల్పించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.

### నేడు ప్లాంట్‌ను ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి


విద్యుత్ ప్లాంట్‌లోని కంట్రోల్ యూనిట్

సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని 3 ఇంక్‌లైన్‌లో 48 ఎకరాల్లో రూ.56.76 కోట్లతో 10.5 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. కాగా కొత్తగూడెంలో ఇప్పటికే త్రీ ఇంక్లైన్, గరిమెళ్లపాడు ప్రాంతాల్లో 37 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు నిర్మించింది. ప్రారంభోత్సవ కార్యక్రమం మధ్యాహ్నం మూడు గంటలకు మొదలవనుంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు పార్థసారథి, వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కాగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏజీఎం సివిల్ రామకృష్ణ తెలిపారు.

# న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

'ఐఏఎల్' మహాసభల్లో జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం లీగల్: న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా, నిజాయితీగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని.. తద్వారా ప్రజల్లో నమ్మకం పెంచాలని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఉమ్మడి జిల్లా తొమ్మిదో మహాసభ శనివారం ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవన్‌లో నిర్వహించారు. ఈ సభలో చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండడం శ్రేయస్కరం కాదని, దాదాపు 50 శాతం కేసులు అనవసరమైనవి ఉంటుండడం బాధాకరమన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగి రూ.20వేల లావాదేవీలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ప్రభుత్వం రూ.10 లక్షలు ఖర్చు పెడుతుందే తప్ప ట్రిబ్యునళ్ల తీర్పును అంగీకరించడం లేదని పేర్కొన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా న్యాయస్థానాలు, సిబ్బంది పెరగాల్సిన అవసరం ఉందని తఆయన తెలిపారు. కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్ న్యాయవ్యవస్థ, వృత్తి సమస్యలపై జూనియర్ న్యాయవాదులకు పలు సూచనలు చేశారు. తొలుత ఐఏఎల్ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పోట్ల మాధవరావు ఆవిష్కరించగా జిల్లా కన్వీనర్ ఓరుగంటి శేషగిరితో పాటు పెమ్మసాని పట్టాభి, ఉదయ్‌భాస్కర్, బొమ్మగాని ప్రభాకర్, దుస్సా జనార్దన్, శ్రీనివాస్, మాధవరావు, అమర్‌చంద్, లతీఫ్, శివరామకష్ణ, నవీన్, జీ.వీ.లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, కొల్లికొండ శరత్‌బాబు, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


లతీఫ్, అధ్యక్షుడు


ఓరుగంటి శేషగిరి, ప్రధాన కార్యదర్శి

**ఐఏఎల్ నూతన కమిటీ ఎన్నిక..**

మహాసభల్లో ఐఏఎల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి శేషగిరిరావు, కార్యదర్శులుగా టి.వెంకట్రావు, అరుణ, మేకల నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా కె.ఉమామహేశ్వరరావు, ఇమామ్ వలీ, కె.రమేష్, కోశాధికారిగా శరత్‌బాబు, మహిళా కార్యదర్శిగా షేక్ నస్రీన్, మీడియా కార్యదర్శిగా జీ.వీ.లక్ష్మీనారాయణ, గౌరవ సభ్యులుగా పారుపల్లి అమర్‌చంద్‌ను ఎన్నుకున్నారు.

# గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ బాటలో నడవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. కామేపల్లిలో శనివారం జరిగిన సేవాలాల్ జయంతి ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పించాక భోగ్ బండార్ పూజలు చేశారు. ఆతర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సేవాలాల్ ఆదర్శాలను చెప్పుకోవడమే కాక పాటించాలని తెలిపారు. తమ ప్రభుత్వం సేవాలాల్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, ఎంపీపీ బానోత్ సునీతతో పాటు తేజావత్ బెల్లయ్యనాయక్, లక్ష్మీనారాయణ, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బానోత్ రామారావు, భూక్యా నాగేంద్రబాబు, బోడా మంగ్యాజీనాయక్, మాలోత్ సరిరాంనాయక్, సుశీలబాయి, సుధాకర్, రవీందర్, తారాదేవి, శ్రీరాణి తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత కొత్తలింగాలలో అక్షర నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ట్రస్మా సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడిన ఎమ్మెల్యే విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఎంఈఓ వెంకటేశ్వర్లుతో పాటు ఐ.వీ.రమణరావు, వీరన్న, కొమ్మినేని వెంకటేశ్వర్లు, కాంతారావు, మంచాల నాగరాజు, అమిరినేని దయానంద్ పాల్గొన్నారు.


కొత్తలింగాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

# వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన

ఐఏఎస్ రోహిణి సింధూరి, ఎమ్మెల్యే రాగమయి పూజలు


పూజల్లో పాల్గొన్న రోహిణి సింధూరి, జయపాల్ రెడ్డి, శ్రీలక్ష్మిరెడ్డి, సాయివర్ధన్‌రెడ్డి తదితరులు

సత్తుపల్లి: జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్.. అంటూ భక్తుల నామస్మరణలతో శనివారం సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి మార్మోగింది. గ్రామానికి చెందిన దాసరి జయపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మిరెడ్డి ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీసీతారాముల విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీటీడీకి చెందిన అర్చకులు దివి బాలాజీ రంగాచార్య ఆధ్వర్యాన 21 మంది రుత్వికులతో ప్రతిష్ఠాపన, శ్రీసీతారామచంద్రస్వామి శాంతి కల్యానం నిర్వహించారు. అనంతరం సుమారు ఐదువేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కాగా, ఆలయంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఆలయ నిర్మాణకర్తలు జయపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మిరెడ్డి పెద్దకుమార్తె కుమార్తె, కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి, చిన్నకుమార్తె డాక్టర్ ప్రియాంక, కుమారుడు దాసరి సాయివర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీధర్‌రెడ్డి, దేశిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఒగ్గు భూపతిరెడ్డి, దారావత్ రామారావు, సారా రవి, ధనలక్ష్మి, అర్జున్, ఏడుకొండలు, ఆనంద్, నవీన్, పూచి చిలుకమ్మ, సూర్యనారాయణ, మధు, భాగ్యరాజు, సుధీర్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు కారణమైన కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: ఓ యువకుడి తల్లి విషయంలో చెడుగా మాట్లాడి ఆయన ఆత్మహత్యకు కారణమైన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఆశారాణి తీర్పు చెప్పారు. శనివారం వెల్లడించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. సింగరేణి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు ఓ మహిళను తనతో రమ్మని వేధించడమే కాక దూషిస్తున్నాడు. దీంతో ఈ విషయం తెలిసి ఆమె కుమారుడు ప్రశ్నించగా.. ఆయన తల్లి విషయంలో చెడుగా మాట్లాడాడు. ఈమేరకు మనస్తాపానికి గురైన యువకుడు 2018 ఆగస్టు 12న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం వెతికే క్రమంలో పత్తి చేనులో పురుగుల మందు డబ్బా, కాస్త దూరంలో మృతదేహం లభించింది. ఈమేరకు సదరు మహిళ తన కొడుకు ఆత్మహత్య కారణమయ్యాడని వెంకటేశ్వర్లుపై కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈసందర్భంగా పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ అనంతరం నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా ఎల్.భద్రునాయక్, ఓ.శ్రీనివాసరావు సహకరించారు.

# చీమలపాడులో గొర్రెల దొంగల హల్‌చల్

కారేపల్లి: మండలంలోని చీమలపాడులో ఇటీవల గొర్రెల దొంగతనాలు పెరిగాయి. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి ఫైల్‌తండాకు చెందిన అజ్మీరా తారాచంద్ గొర్రె పోతు చోరీకి గురైంది. దీనిని వెతికే క్రమంలో చోరీ చేసిన వ్యక్తులు ఇంకొన్ని గొర్రె పోతులను సుబాబుల్ తోటలో కట్టేసి అరవకుండా నోళ్లు తాళ్లతో కట్టినట్లు గుర్తించారు. అనంతరం కోయడానికి సరంజామా కోసం ఊరిలోకి వెళ్లగా, తారాచంద్ తదితరులు కలిసి వారిని పట్టుకున్నారు. చోరీల విషయమై ప్రశ్నిస్తుండగానే కొందరు పరారుకాగా మిగిలిన వారు వాగ్వాదానికి దిగారు. చివరకు బాధితుడు శనివారం పోలీసువలకు ఫిర్యాదు చేసేందుకు కారేపల్లికి రాగా, నాయకులు, ప్రజాప్రతినిధులు సర్దిచెప్పి పరిహారం ఇప్పిస్తామని తెలిపారు. ఈమేరకు తారాచంద్ గొర్రె పోతుకు రూ.1.20 లక్షలు, ఇంకో బాధితుడు రంగయ్యకు రూ.45 వేలు పరిహారం ఇవ్వాలని పెద్ద మనుషులు తీర్పు ఇచ్చినట్లు తెలిసింది.

# నకిలీ బంగారంతో బురిడీ?

రూ.5 లక్షలు నష్టపోయిన బాధితులు

చింతకాని: బంగారం ఆశ చూపి అమాయకుల నుంచి రూ.5లక్షలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాతుల పెంపకం పేరిట వచ్చిన వ్యక్తి చెప్పిన మాయమాటలు నమ్మిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన నలుగురు లక్షలు నష్టపోయారు. వివరాలిలా ఉన్నాయి. బాతుల పెంచుతున్నానంటూ ఓ వ్యక్తి మండలానికి వచ్చాడు. ఆయన తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నమ్మబలకడంతో గ్రామస్తులు నలుగురు ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటి వెళ్లారు. అక్కడ ఓ ముఠా కలిసి ఓ ఇంట్లో తవ్వకాలు చేస్తుండగా బంగారంతో నిండిన కుండలు బయట పడ్డాయని, అందులో రెండు కేజీల పాత బంగారు నాణాలు, గుండ్లు ఉన్నాయని నమ్మబలికారు. తొలుత ఒక గ్రాము బంగారు గుండ్లు ఇవ్వగా గ్రామం నుంచి వెళ్లిన నలుగురు ఖమ్మం చేరుకుని ఓ వ్యాపారి వద్ద పరీక్ష చేయించగా నిజమైన బంగారమేనని తేలింది. అనంతరం రెండు రోజులకు ముఠా సభ్యులు ఫోన్ చేసి డబ్బులు అత్యవసరం కావడంతో రెండు కేజీల బంగారాన్ని రూ.5 లక్షలకే ఇస్తామని చెప్పారు. దీంతో ఈ నలుగురు అప్పు చేసి రూ. 5 లక్షలు సమకూర్చుకుని రాయచోటికి వెళ్లగా డబ్బు తీసుకుని బంగారం సంచి ఇచ్చేసి వెళ్లిపోయారు. ఈమేరకు సంతోషంగా వచ్చిన గ్రామస్తులు అందులోని కొంత బంగారాన్ని పరీక్ష చేయించగా నకిలీ బంగారమని తేలడంతో మోసపోయామని గుర్తించారు. అయితే, ఈ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని బయటకు పొక్కనివ్వడం లేదని సమాచారం.

### ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


రాంబాబు (ఫైల్)

కారేపల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కారేపల్లి మండలం గుంపెళ్లగూడెంకు లావుడ్యా రాంబాబు(28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణలో పాలుపంచుకుంటున్న ఆయన గతేడాది నుండి మూడెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఇంతలోనే ఇంటి నిర్మాణం కూడా చేపట్టాడు. అయితే, వ్యవసాయం దెబ్బతిని పెట్టుబడులు కూడా రాకపోవడంతో రూ.3 లక్షల మేర అప్పులయ్యాయి. వీటిని తీర్చలేని పరిస్థితి ఎదురుకావడంతో రాంబాబు ఈనెల 14న ఇంట్లోనే పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ రాజారాం తెలిపారు.

### గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని మున్నేరులో పడి గుర్తుతెలియని వృద్ధురాలు(85) మృతి చెందింది. ఖమ్మం కాల్వొడ్డు శ్మశాన వాటిక వెనుక భాగాన ఉన్న బ్రిడ్జి కింద వృద్ధురాలి మృతదేహాన్ని శనివారం గుర్తించిన స్థానికులు ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివా సరావు సహకారంతో మార్చురీకి తరలించారు. కాగా, మృతురాలు ప్రమాదవశాత్తు మున్నేరులో పడిందా, ఆత్మహ త్య చేసుకుందా అనేది తెలియరాలేదు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లేనందున ఆచూకీ తెలిసిన వారు 87126 59115 నంబర్‌లో సంప్రదించాలని సీఐ రమేష్ సూచించారు.

**రైలు కింద పడి ఒకరు..**

బోనకల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ రైల్వే సబ్‌స్టేషన్ సమీపాన ఎగువ ట్రాక్‌పై కేరళ ఎక్స్‌ప్రెస్ కింద పడి శనివారం సదరు వ్యక్తి మృతి చెందాడు. ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.